'ఫ్యాన్' కోసం కదం తొక్కిన
మహిళాలోకం

- చివరి రోజు ఎన్నికల ప్రచార ర్యాలీ
- వేలాదిగా తరలివచ్చిన అక్కచెల్లెమ్మలు
- ద్వారంపూడి అభ్యర్థిత్వానికి భారీ మద్దతు

కాకినాడ: ఎన్నికల ప్రచారానికి చివరి రోజైన శనివారం వైఎస్సార్ సీపీకి మద్దతుగా మహిళాలోకం కదలి వచ్చింది. వేలాదిగా తరలివచ్చిన అక్కచెల్లెమ్మలతో కాకినాడ ప్రధాన రహదారులు సందడి మారాయి. వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ వైఎస్సార్ సీపీ నగర కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక ఆనందభారతి గ్రౌండ్స్ వద్ద ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పూర్తిగా మహిళలతో కూడిన ర్యాలీ ప్రారంభించారు. ఆనందభారతి గ్రౌండ్స్ నుంచి మెయిన్‌రోడ్, చందన బ్రదర్స్, సూపర్‌బజార్, మసీదు సెంటర్, గ్లాస్‌హౌస్, గోల్డ్ మార్కెట్‌సెంటర్, జగన్నాథపురం, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, సినిమా రోడ్డు మీదుగా తిరిగి ఆనందభారతి గ్రౌండ్స్ వరకు ర్యాలీ కొనసాగింది. కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ సతీమణి హిమబిందు, ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి సతీమణి మహాలక్ష్మి, కుమార్తెలు డాక్టర్ ప్రణీత, డాక్టర్ అంజనితోపాటు పలువురు పార్టీ మహిళా నాయకులు, మాజీ కార్పొరేటర్లు, మహిళా కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఎన్నికల ప్రచార వాహనాలను ముందుంచి ఫ్యాన్ గుర్తు నమూనాలను చేతబట్టి దారి పొడవునా వ్యాపార వర్గాలు, వాహన చోదకులకు విక్టరీ సింబల్‌ను, ఫ్యాన్ గుర్తును చూపిస్తూ ఉత్సాహపూరిత వాతావరణంలో ర్యాలీ సాగింది. హిమబిందు, మహాలక్ష్మి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పథకాలు, మేనిఫెస్టో శ్రీరామరక్షగా ఎమ్మెల్యే సతీమణి మహాలక్ష్మి పేర్కొన్నారు. గడచిన ఐదేళ్ళలో చేసిన అభివృద్ధి, సంక్షేమమే తమ పార్టీ విజయానికి సోపానమని ఆమె పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ మహిళా న్యాయవాదులతో పాటు, వివిధ డివిజన్ల నుంచి మహిళా కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, పెద్ద సంఖ్యలో మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.



ర్యాలీకి భారీగా తరలివచ్చిన మహిళలు



ర్యాలీలో పాల్గొన్న హిమబిందు, మహాలక్ష్మి, ప్రణీత, అంజని తదితరులు



ఎన్నికల ప్రచారం చేస్తున్న డాక్టర్ ఉదయ్‌శేఖర్‌రెడ్డి

అభివృద్ధికి మళ్లీ పట్టం కట్టండి

కాకినాడ: గడచిన ఐదేళ్లలో సాధించిన ప్రగతిని దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి పట్టం కట్టాలని ఆయన అల్లుడు ఉదయ్‌శేఖర్‌రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక 41వ డివిజన్ పట్టాభివీధి, ప్రతాప్‌నగర్ మెయిన్‌రోడ్, మల్లయ్య అగ్రహారం ప్రాంతాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 2019 తరువాత ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధిని వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి వెంకట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వినుకొండ పట్టాభి రామయ్య, శర్మ తదితరులు పాల్గొన్నారు.

హోరెత్తిన ప్రచారం

- ముగిసిన ఎన్నికల ప్రచార పర్వం
- చివరి రోజున వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కన్నబాబు ప్రచారం
- ఆయనకు మద్దతుగా గ్రామాలలో ర్యాలీలు

కాకినాడ రూరల్: సార్వత్రిక ఎన్నికల పోరులో కీలకమైన ప్రచార పర్వానికి తెరపడింది. కొన్ని రోజులుగా హోరెత్తించిన మైక్‌లు మూగబోయాయి. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల ప్రచారం శనివారం సాయంత్రం 5 గంటలతో ముగిసింది. ప్రచార పర్వంలో మిగిలిన అభ్యర్థుల కంటే ముందున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు చివరి రోజున శనివారం విస్తృతంగా పర్యటించారు. నియోజకవర్గ పరిధిలోని కాకినాడ అర్బన్‌లోని 1వ డివిజన్ రమణయ్యపేట సంత మార్కెట్ వద్ద కనకదుర్గ ఆలయం నుంచి ప్రారంభించి డివిజన్ పరిధిలో ప్రచార వాహనంపై పర్యటించారు. ఒకటో డివిజన్ ఇన్‌చార్జి వాసురెడ్డి సూరిబాబు, కొప్పిశెట్టి రమణ, నాగు తదితరులు పాల్గొన్నారు. అక్కడ నుంచి మూడో డివిజన్‌కు చేరుకుని డి మార్ట్ సెంటరు నుంచి మొదలుకుని మూడు గుళ్ల సెంటరు, శాంతనపురి కాలనీ, ఎస్సీ పేట, ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డు తదితర ప్రాంతాలలో ఆయన పర్యటించారు. పర్యటనలో డివిజన్ ఇన్‌చార్జి వడ్డి మణికుమార్, వైస్సార్‌సీపీ నాయకుడు నేరేళ్ల తదితరులు పాల్గొన్నారు. అనంతరం 47వ డివిజన్ చేరుకుని స్థానికంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. డివిజన్ ఇన్‌చార్జి రాజారపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు. తరువాత కాకినాడ రూరల్ మండలం రేపూరు గ్రామంలో కన్నబాబు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నక్కా వీరన్న, గ్రామ కమిటీ అధ్యక్షుడు తలాటం ధర్మరాజు, ఎంపీటీసీ మామిడాల నాగచక్రం తదితరులు పాల్గొన్నారు. అనంతరం కొవ్వాడ తారకరామనగర్‌లో పర్యటించారు. కార్యక్రమంలో సర్పంచ్ పిల్లి చక్రరావు, ఎంపీటీసీ ఊబా నాగమణి, శ్రీను, పుల్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గొడారిగుంటలో ప్రజలకు అభివాదం చేస్తూ మద్దతు కోరుతున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు

గ్రామాలలో జోరుగా ప్రచారం

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబుకు మద్దతుగా గ్రామాలలో ఆ పార్టీ శ్రేణులు చివరి రోజున భారీగా ప్రచార ర్యాలీలు నిర్వహించారు. తిమ్మాపురంలో సర్పంచ్, జేఎన్‌టీయూకే ఈసీ మెంబరు బెజవాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో సుమారు 500 మంది కార్యకర్తలు, మహిళలు కలిసి గ్రామంలో పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా కన్నబాబు, ఎంపీగా సునీల్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు. వైస్ ఎంపీపీ బందిలి వీరేష, ఎంపీటీసీ ముద్దన వెంకట్రాజు, కాళ్ల వెంకటేశ్వరరావు, చక్రీ, శివ తదితరులు పాల్గొన్నారు. సర్పవరంలో వైఎస్సార్ సీపీ నాయకుడు పుల్ల చందు ఆధ్వర్యంలో భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు పాల్గొన్నారు.



కన్నబాబుకు మద్దతుగా ప్రచారం చేస్తున్న సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ తదితరులు

గ్రామాల్లో విస్తృత ప్రచారం

కరప: మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి అయిదేళ్లలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, గ్రామాల్లో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు చేసిన అభివృద్ధిపనులు, అధికారంలోకి వస్తే అమలుచేసే 2024 ఎన్నికల మేనిఫెస్టోను వివరించి, ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈనెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఫ్యాన్‌గుర్తుపై రెండుసార్లు ఓటేసి కాకినాడరూరల్ ఎమ్మెల్యేఅభ్యర్థి కురసాల కన్నబాబును, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. పాతర్లగడ్డలో సర్పంచ్ నాగిరెడ్డి ఏసుబాబు, నడకుదురులో సర్పంచ్ దేగల లలితకుమారి, ఎంపీటీసీలు పైలా రామతులసి, ముమ్మిడి బుచ్చిబాబు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గోమాడ ఏసుబాబు, గొడ్డటిపాలెంలో సర్పంచ్ వాసంశెటిట శ్రీనుబాబు, అరట్లకట్టలో గ్రామకమిటీ అధ్యక్షుడు సోడగం సూరిబాబు, కొరిపల్లిలో సర్పంచ్ పలివెల నాగేశ్వరరావు, ఎంపీటీసీ దేవిశెట్టి సూర్యప్రకాష్, వలసపాకలలో సర్పంచ్ వాసంశెట్టి రామారావు, ఉప్పలంకలో సర్పంచ్ బొమ్మిడి నయోమి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బొమ్మిడి సతీష్, కరపలో సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, జెడ్.భావారంలో సర్పంచ్ కొత్త నాగలక్ష్మి తదితరులు ఇంటింటికీ వెళ్లి బ్యాలెట్ నమూనా చూపించి ఫ్యాన్‌గుర్తుపై ఓటేసి కురసాల కన్నబాబు, చలమలశెట్టి సునీల్‌ను గెలిపించి, జగనన్న మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఓటర్లను కోరారు. పలుగ్రామాల్లో ఆటోల ర్యాలీ నిర్వహించి ఎన్నికల ప్రచారం చేశారు.



పాతర్లగడ్డలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

క్లుప్తంగా

ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్వో వెంకటరావు


కాకినాడ: సార్వత్రిక ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్టు నియోజకవర్గ రిటరినింగ్ అధికారి జె.వెంకటరావు తెలిపారు. స్థానిక మెక్లారిన్ గ్రౌండ్స్ ఆవరణలోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో శనివారం ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. ఎన్నికలకు సంబంధించి ఈవీఎం, వీవీప్యాట్‌లతో పాటు ఇతర సామగ్రిని సంబంధిత పోలింగ్ అధికారులకు ఆదివారం మధ్యాహ్నం లోపు పంపిణీ చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. వీటిని ఆయా రూట్లలో పోలింగ్ స్టేషన్లకు తరలించేందుకు వీలుగా 46 బస్సులను సిద్ధం చేశామన్నారు. ఆదివారం మధ్యాహ్నానికి ఆయా రూట్లలో బస్సులలో ఎన్నికల సామగ్రి తరలించనున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో మెక్లారిన్ గ్రౌండ్స్ ఆవరణలో చేపట్టాల్సిన ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. సెక్టార్ అధికారులు, ఇతర ఎన్నికల అధికారులతో సమీక్షించారు. ఆయన వెంట ఎస్ఈ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కూటమి ఎన్నికల ప్రచారం

కరప: మండలం సిరిపురం, నడకుదురు గ్రామాల్లో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, కరపలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలో కల్సి పర్యటించారు.

విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయండి

- ఓటర్లకు ఎమ్మెల్యే ద్వారంపూడి వినతి



కాకినాడ: ఈ నెల 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని వైఎస్సార్‌సీపీ కాకినాడ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కోరారు. సోమవారం పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఆయన శనివారం సాయంత్రం ఓటర్లకు విజ్ఞప్తి చేస్తూ ప్రకటన విడుదల చేశారు. 2019 నుంచి 2024 వరకు ఐదేళ్లపాటు నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించానన్నారు. కాకినాడ ప్రజలు శాంతియుత వాతావరణంలో జీవించే వాతావరణాన్ని నెలకొల్పి ప్రతి డివిజన్‌లో రహదారులు, డ్రైనేజీలు, కల్యాణ మండపాలు వంటి సదుపాయాలు కల్పించామన్నారు. ప్రధానంగా పారిశుధ్య నిర్వహణను ఎంతో మెరుగుపరిచి నగరాన్ని తీర్చిదిద్దడం ద్వారా దేశంలోనే కాకినాడ 2వ స్థానంలో నిలబెట్టగలిగామన్నారు. ఎల్లప్పుడూ ఆదరించి అభిమానించిన ప్రజలు ఈ సారి కూడా తనను గెలిపిస్తే కాకినాడకు అంతర్జాతీయ ఖ్యాతిని తీసుకువస్తానన్నారు. కూటమి నాయకులు ఇచ్చే మోసపూరిత వాగ్దానాలను నమ్మకుండా విజ్ఞతతో ఆలోచించి ఓటును సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ద్వారంపూడి కోరారు. ఎలాగైనా ఎన్నికల్లో గెలవాలనే ఏకైక లక్ష్యంతో చేస్తున్న తప్పుడు వాగ్దానాలు, దుష్ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని సూచించారు. నిత్యం అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసే తనకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే ద్వారంపూడి కోరారు.

ఆ ఐదుగురే.. స్టార్ క్యాంపైనర్లు

కాకినాడ: వైద్య రంగంలో స్థిరపడ్డ ఇద్దరు కుమార్తెలు, అల్లుళ్లు, సతీమణి మహాలక్ష్మిలను ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తన ఎన్నికల సమరంలో కీలక బాధ్యులను చేశారు. భార్య ద్వారంపూడి మహాలక్ష్మి, కుమార్తెలు డాక్టర్ ప్రణీత, డాక్టర్ అంజని, అల్లుళ్లు డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి, డాక్టర్ ఉదయ్‌శేఖర్‌రెడ్డిలకు ప్రచార బాధ్యతలు అప్పగించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, పార్టీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి తదితరులను సమన్వయం చేసుకుంటూ వారు గడచిన 20 రోజులుగా ద్వారంపూడి గెలుపునకు ప్రచారం చేశారు. మరోసారి జగన్‌ను సీఎం చేయాల్సిన ఆవశ్యకతను, ద్వారంపూడిని ఎందుకు మళ్లీ ఎమ్మెల్యేగా ఎన్నుకోవాలో తెలియజేస్తూ ప్రచారాన్ని సాగించారు. ప్రధానంగా 2019 నాటికి కాకినాడ దుస్థితి, 2019–2024 మధ్య జరిగిన అభివృద్ధిని ప్రజలకు అర్థమయ్యేలా వివరించి ఆకట్టుకోగలిగారు. అలాగే జగన్నాథపురానికి ఆయన సోదరుడు వీరభద్రారెడ్డి ప్రత్యేక బాధ్యతలు తీసుకుని ప్రచారం చేశారు.



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి మహాలక్ష్మి దంపతులతో పాటు కుమార్తెలు ప్రణీత, అంజని, అల్లుళ్లు ఉదయ్‌శేఖర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి

1640 మంది పోలింగ్ సిబ్బందికి ర్యాండమైజేషన్

కాకినాడ సిటీ: సాధారణ ఎన్నికలు–2024 నిర్వహణలో భాగంగా పోలింగ్ కేంద్రాల మూడో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను శనివారం కలెక్టరేట్ ఎన్ఐసీ సెంటర్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్, జిల్లా పరిశీలకులు ఎస్.గణేష్, రాజేష్ జోగ్‌పాల్ సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నివాస్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనలకు అనుగుణంగా కాకినాడ పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి మూడో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా ఈనెల 13న జరిగే ఓటింగ్ ప్రక్రియలో పాల్గొనే పోలింగ్ సిబ్బందికి మొత్తం 1,640 పోలింగ్ కేంద్రాలకు కేటాయించామన్నారు. పీవో, ఏపీవో, ఓపీవో, మైక్రో అబ్జర్వర్లు ఇతర సిబ్బందికి 12న ఆయా నియోజకవర్గాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో అబ్జర్వర్లు ఇతర సిబ్బందికి 12న ఆయా నియోజకవర్గాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పోలింగ్ సామగ్రితో పాటు ఏ పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వర్తించాలో తెలియజేయడం జరుగుతుందన్నారు. పోలింగ్ సిబ్బంది అంతా ఆదివారం నిర్ణయించిన సమయానికి ఆయా డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకోవాలన్నారు. ఎవరైనా ఎన్నికల విధులకు గైర్హాజరైనట్టయితే వారిపై ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నివాస్ స్పష్టం చేశారు. కాకినాడ జిల్లాలో నిష్పక్షపాతంగా పారదర్శకంగా పోలింగ్ ప్రక్రియ జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ 13వ తేదీన తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో సీపీవో త్రినాథ్, ఎన్ఐసీ ఐటీ డైరెక్టర్ సీహెచ్ సుబ్బారావు, ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



మూడో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్న కలెక్టర్ నివాస్

జై ఓటరన్నా





తాను గీసిన చిత్రంతో చిరంజీవిరావు

కరప: దేశ భవిష్యత్‌ను కాపాడేది ఓటు హక్కే అంటూ కరప మండలం కూరాడ జెడ్పీ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ టీచర్ పెట్టా చిరంజీవిరావు వేసిన చిత్ర లేఖనం ఓటర్లను చైతన్యపరుస్తోంది. దేశం కోసం పాటుపడే సైనికుడిని జై జవాన్ అని, అన్న దాతను జై కిసాన్ అని అంటారు. దేశ భవిష్యత్‌ను మార్చే ఏకైక ఆయుధం ఓటు, అటువంటి పవిత్రమైన ఓటును మద్యానికి, డబ్బుకి, పలావు ప్యాకెట్‌కు అమ్ముడుపోయి, దేశాన్ని నాశనం చేసే నాయకులను, రౌడీలను ఎన్నుకోరాదని, ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా మంచి నాయకుడిని ఎన్నుకునేందుకు ఓటు అనే ఆయుధాన్ని ఉపయోగించి 'జై ఓటరన్నా' అనిపించుకుందాం అనే సందేశంతో గీసిన ఆయన చిత్రం అందరినీ ఆలోచింపజేస్తోంది.

ఓటరు మదిలో ఏముందో!

- గెలుపుపై ఎవరికి వారే ధీమా
- రేపే పోలింగ్.. సర్వత్రా ఉత్కంఠ

కాకినాడ సిటీ: ఓటరు మదిలో ఏముందనే ప్రశ్న ప్రస్తుతం బరిలో ఉన్న అన్ని పార్టీలను కలవరపెడుతోంది. నెల్లాళ్లుగా సాగిన ఎన్నికల ప్రచారానికి ఎన్నికల నిబంధనలతో శనివారం సాయంత్రం 6 గంటలకు పల్లెలు, పట్టణాల్లో నిశ్శబ్దం ఆవరించింది. ఎన్నికలకు ఒక రోజే సమయం ఉండడంతో ప్రలోభాల పర్వం సాగుతోంది. ఈ తంతు కట్టడికి అధికార, పోలీస్ యంత్రాంగం నెల రోజుల నుంచి శ్రమిస్తూ వస్తోంది.

పల్లెల్ని చుట్టేసిన పార్టీలు

నామినేషన్లు దాఖలు చేసినది మొదలు లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఇంటింటికీ తిరుగుతూ తమ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎవరి గెలుపుపై వారు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నా లోపల ఏదో గుబులు వారిని వెంటాడుతూనే ఉంది.

మహిళలు, వృద్ధులకు ప్రత్యేక తాయిలాలు

యువకులు, సాధారణ ఓటర్లకు మద్యం, డబ్బు పంపిణీ చేయాలని నిర్ణయించుకున్న ఆయా పార్టీలు, మహిళలు, వృద్ధులకు మాత్రం ప్రత్యేక తాయిలాలు ఇస్తున్నట్టు తెలిసింది. ఈ పంపకాలన్నీ గ్రామాల్లో సమర్థమైన నాయకుల చేతుల మీదుగానే జరగాలని, అలా చేస్తేనే మహిళలకు, వృద్ధులకు తమ పంపిణీ చేయడం వల్ల వారికి పంపిణీ ఫలం అందుతుందనీ అభ్యర్థుల అభిప్రాయం. అందుకే పకడ్బందీ ఏర్పాట్లతో ముందుకు వెళ్తున్నారనే చర్చ జరుగుతోంది. ఇదిలా ఉండగా ఇప్పటికే ఆయా గ్రామాల్లో పంపకాలు జోరందుకున్నాయని సమాచారం. రాత్రి సమయాల్లో రోజుకు ఇద్దరు, ముగ్గురు పార్టీల వాళ్ల వచ్చి ఓటర్లను కలుస్తున్నారని వినికిడి.